క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీతారామ పురం విద్యుత్ సబ్ స్టేషన్, 11 కేవీ సూర్యా రావుపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 8.15 గంటల నుంచి 10.15 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాఅగ్రహారం కాలువగట్టు, సీతారామ పురం వీఎంసీ డ్రెయినేజీ పంపు హౌస్, కొత్త వంతెనరోడ్, జనతాప్రెస్ రోడ్, బోడేపూడి వారి వీధి, కాట్రగడ్డ వారి వీధి, అంకమ్మ తల్లి టెంపుల్ ఏరియా, అయ్యన్నాయుడు వీధి, దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, బోయపాటి వారి వీధి విజయా హాస్పిటల్ ఏరియా, జడగం వారి వీధి, వేమూరి వారి వీధి, ఏలూరు రోడ్ ఆంజనేయ స్వామి టెంపుల్ ఏరియా, డోర్నకల్ రోడ్ వీధిరాజు మేడ ఏరియా, గోపరాజు రామచంద్రరావు రోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు క్యాంపస్ డ్రైవ్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఐటీఐ ఆఖరి సంవత్సరం విద్యార్థుల కోసం ఈ నెల 19వ తేదీ గురువారం తమ కళాశాల ఆవరణలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఖాళీలను భర్తీ చేస్తారని తెలిపారు. ఐటీఐ చదివిన వారు విజయవాడ రమేష్ ఆసుపత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు గురువారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 92986 05175 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

మ్యాన్‌హోల్ వద్ద వ్యర్థాల తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీ నగర్ మెయిన్ రోడ్డులో మ్యాన్‌హోల్ వద్ద మరమ్మతులలో భాగంగా వదలివేసిన వ్యర్థాలను మంగళవారం తొలగించారు. ఇటీవల 30వ డివిజన్ దేవీనగర్ మెయిన్ రోడ్డులో మ్యాన్‌హోల్‌ను రోడ్డుకు సమానంగా చేశారు. ఇందుకుగాను మ్యాన్‌హోల్‌లను తవ్వి సరిచేశారు. మ్యాన్‌హోల్‌లకు మరమ్మతులలో భాగంగా వచ్చిన వ్యర్థాలను రోడ్డుపైనే వదలివేశారు. దీంతో రాకపోకలకు వాహన చోదకులు పాదచారులు అవస్థలు పడుతున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రోడ్డుపై వ్యర్థాలను తొలగించారు.

చిట్టీల పేరుతో మోసం

కృష్ణలంక పీఎస్‌లో ఫిర్యాదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిట్టీల పేరుతో డబ్బులు కట్టించుకుని మోసం చేసిన ఘటనపై పలువురు మహిళలు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక 21వ డివిజన్‌కు చెందిన పేరం వెంకటనర్సమ్మ(చిన్ని) కొన్నేళ్లుగా ప్రైవేట్ చిట్టీ వ్యాపారం నిర్వహిస్తోంది. 21, 22 డివిజన్లకు చెందిన ధనలక్ష్మి, వెంకాయమ్మ, లావణ్య, వారితో పాటు మరికొందరు మహిళలు రూ.లక్ష, రూ.60వేలు చిట్టీలు ఆమె వద్ద వేశారు. కాలపరిమితి ముగిసినా చిట్టీ డబ్బులు ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా తన వద్ద చిట్టీలు వేసి వారే పాడుకుని కట్టకుండా మోసం చేశారని, తనకే డబ్బులు ఇవ్వాలని చిన్ని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరువురి ఫిర్యాదులను స్వీకరించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వాస్పత్రి సైక్రియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ రాఘవరావు అన్నారు. జూన్ 26 మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రిలోని డి ఎడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో కలిసి మత్తు పదార్థాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ రాఘవరావు మాదకద్రవ్యాల వినియోగం, వాటి వలన కలిగే దుష్పరిణామాలు, చికిత్సపై ప్రజలు, రోగులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ శోభ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తారా, డాక్టర్ రామ్‌నరేష్‌రెడ్డి, డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కలగానే అయోధ్యనగర్ వంతెన

- 15 ఏళ్ల క్రితం ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదన
- ఇప్పటి వరకు అమలుకు నోచుకోని వైనం
- వంతెన నిర్మాణంకోసం ఎదురు చూస్తున్న ప్రజలు



గతంలో వంతెన నిర్మాణానికి అయోధ్యనగర్‌లో కేటాయించిన స్థలం

సత్యనారాయణపురం (విజయవాడసెంట్రల్): ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. సుమారు 15 ఏళ్ల క్రితం ఈ ప్రాంత వాసుల రాకపోకలకు అనువుగా ఉండేందుకు వంతెన నిర్మాణం చేపట్టాలని నగరపాలక సంస్థ, నేతలు ప్రతిపాదనలు చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా ఆ ప్రతిపాదనలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

ఎదురు చూపులు

అయోధ్యనగర్ చుట్టు పక్కల ప్రాంతవాసులు ఎదురు చూస్తున్న అయోధ్యనగర్ నుంచి సత్యనారాయణపురం వరకు ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుందోనని, తమ కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఈ ప్రాంతాలకు మేలు..

ఈ వంతెన నిర్మాణం జరిగితే ఒక వైపు అయోధ్యనగర్, శాంతినగర్, బసవతారకనగర్, రామలింగేశ్వరపేట తదితర ప్రాంతాలతో పాటు మరో వైపు సత్యనారాయణపురం, భగత్‌సింగ్‌రోడ్డు, తదితర ప్రాంతాల మధ్య రాకపోకలకు ఎంతో సులభతరం అవుతుందని స్థానికులు చెప్తున్నారు.



సత్యనారాయణపురం నుంచి వంతెన నిర్మాణం జరగాల్సిన ప్రాంతం

ప్రస్తుతం ఈ ప్రాంత వాసులు సత్యనారాయణపురంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఆసుపత్రులు, పలు దేవాలయాలు ఉండటంతో అయోధ్యనగర్ ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా బుడమేరు వంతెన మీదుగా లేదా ప్రభాస్ కళాశాల వద్ద ఉన్న వంతెనను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవటమే కాకుండా ప్రైవేటు వాహనాలకు ఖర్చులు అధికంగా చెల్లించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

బుడమేరు వంతెనపై పెరిగిన రద్దీ..

ఒక వైపు నున్న, సింగ్‌నగర్, దేవీనగర్, రామకృష్ణాపురం, రాజరాజేశ్వరిపేట తదితర ప్రాంతాల నుంచి నిత్యం వచ్చే వేలాది వాహనాలతో బుడమేరు వంతెన, ప్రభాస్ కళాశాల వద్ద ఉన్న వెంతెన నిత్యం రద్దీగా ఉంటున్నాయి. దీంతో ఆ వంతెనపై ఒత్తిడి పెరిగి దెబ్బతినే పరిస్థితికి వస్తోందని అంటున్నారు.

దృష్టి సారించాలని వినతి..

ఈ పరిస్థితిల్లో అయోధ్యనగర్ వద్ద వంతెన నిర్మాణం చేపడితే ఆ రెండు వంతెనలపైన ట్రాఫిక్ రద్దీ తగ్గటమే కాకుండా స్థానికులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ దృష్టిసారించి వంతెన నిర్మాణానికి కృషిచేయాల్సిందిగా స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మానసిక స్థిరత్వం యోగాతో సాధ్యం



యోగాసనాలు వేస్తున్న సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు

విజయవాడస్పోర్ట్స్: శారీరక దృఢత్వానికి, మానసిక స్థిరత్వానికి యోగాసనాలు ఎంతో దోహదం చేస్తాయని కృష్ణా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎల్.సుశీల వివరించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమాన్ని నగరంలోని శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కళాశాల విద్యార్థినులతో యోగాసనాలు సాధన చేయించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుశీల మాట్లాడుతూ శారీరక సమస్యలు, మానసిక ఒత్తిడిని జయించేందుకు వ్యాయామం నిత్య దినచర్యలో భాగం కావాలన్నారు. దీనిలో భాగంగానే యోగా నిత్య సాధనతో ఆనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చని విద్యార్థినులకు సూచించారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ యోగాసనాలు సాధన చేయాలని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.సుబ్రహ్మణ్య కుమార్ మాట్లాడుతూ విద్యా ప్రణాళికలో యోగాను భాగంగా చేర్చామని, ప్రతి విద్యార్థి యోగా సాధన చేసేలా ప్రణాళికను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.హేమ, వార్డెన్ డాక్టర్ కె.ఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో 'మా రాముడు అందరివాడు' షూటింగ్

26న ట్రైలర్ విడుదల



మాట్లాడుతున్న సినీనటుడు సుమన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో 'మా రాముడు అందరివాడు' చిత్ర షూటింగ్ సన్నివేశాలు మంగళవారం చిత్రీకరించారు. హనుమాన్ పేట లోని ఆలపాటి రామారావు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చిత్రీకరణలో ముఖ్యమంత్రి పాత్రలో హీరో సుమన్, ఎమ్మెల్యే, గ్రామస్తుల మధ్య జరిగే సంభాషణను చిత్రీకరించారు. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను వెల్లడించేందుకు చిత్ర యూనిట్ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. హీరో సుమన్ మాట్లాడుతూ దర్శకుడు మైఖేల్ కథ తెలిపిన వెంటనే నటించడానికి అంగీకరించినట్లు తెలిపారు. చిన్న చిత్రాలలో మంచి కథాంశం, ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారన్నారు. సినీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తే మరింతగా చిత్ర పరిశ్రమ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం హీరో శ్రీరామ్ మాట్లాడుతూ జూన్ 26వ తేదీన 'మా రాముడు అందరివాడు' చిత్ర ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. చిత్ర దర్శకుడు మైకేల్ మాట్లాడుతూ పూర్తిస్థాయి గ్రామీణ నేపథ్యమున్న చిత్రాన్ని అద్భుతంగా తీస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమాలో హీరో సుమన్ ముఖ్యమంత్రి పాత్రలో నటిస్తున్నారన్నారు. చిత్ర నిర్మాత అనుముల లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అవినీతి ఆక్రమాలపై నిలదీసే సన్నివేశాలు ఈ చిత్రంలో నిజ జీవితానికి దగ్గరగా ఉండేలా చిత్ర నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కాలేజీలో ప్రైవేటు పనులను అడ్డుకున్న అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన గులాబీతోట బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని స్థలంలో ప్రైవేటు పాఠశాలకు చెందిన వ్యక్తులు నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో కళాశాల పూర్వ విద్యార్థులు మంగళవారం కళాశాల స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కళాశాల స్థలంలో జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం అధికారులు కళాశాల స్థలంలో నిర్మాణాలను అడ్డుకుని సదరు సామాన్లు తీసుకువెళ్లిపోయారు. మరోమారు నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాల స్థలాన్ని నిషేధిత జాబితాలో చేర్చి ఎటువంటి నిర్మాణాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పూర్వ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు. కళాశాల స్థలం పరిరక్షించటానికి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాంధ్ర అవగాహన ర్యాలీ చేస్తున్న స్టెల్లా కళాశాల విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): యోగాతో మనిషిలో మానసిక, శారీరక ప్రశాంతత పెరుగుతుందని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ అన్నారు. మంగళవారం కళాశాల నుంచి చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి 16 సర్వీస్ రోడ్డులో బెంజిసర్కిల్ వరకు అక్కడి నుంచి మళ్లీ కాలేజీ వరకు యోగాంధ్ర-2025పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ సుశీల విద్యార్థులతో కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో యోగా సాధన చేయించారు. అనంతరం జసింత క్వాడ్రస్ మాట్లాడుతూ యోగాతో వ్యక్తిత్వ వికాసం మెరుగవుతుందన్నారు. అంతకు ముందు ఎల్ఈపీఎల్ మాల్ వద్ద ఎన్‌సీసీ విద్యార్థులు యోగా మైమ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యూసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఇన్నాసియా, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్స్‌ఉష కుమారి. డాక్టర్ సిస్టర్ ఆషా ,ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వున్నాం తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ



కల్యాణ మండపంలో అన్న ప్రసాద వితరణ చేస్తున్న కమిటీ సభ్యులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రసాదాలకు దాత లక్ష్మి, నవీన్‌కుమార్, దుర్గారావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో పలువురు ఉభయదాతలు, ముత్తయిదువులకు ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేసింది. అనంతరం కళ్యాణ మండపంలో ప్రసాద వితరణ జరిగింది. కమిటీ ప్రధాన కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు, మరుపిళ్ల సత్యనారాయణ పర్యవేక్షించారు.

నూతన కమిటీ ఎన్నిక

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టర్-1 ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యులు నూతన కమిటీ అధ్యక్షుడిగా వెలగా సురేష్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణరావు, అల్లు విజయలక్ష్మి, కార్యదర్శిగా కర్రి రవిలతో పాటు 30 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేష్ నూతన అసోసియేషన్ చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంల అసోసియేషన్ సభ్యులు, స్థానిక నివాసితులు పాల్గొన్నారు.

21 కేజీల గంజాయి స్వాధీనం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గంజాయి విక్రయిస్తున్న పాత నేరస్తుడిని ఎస్ఎన్‌పురం పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..గోళ్ల సాంబశివరావు అనే పాత నేరస్తుడు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో సిబ్బందితో కలిసి సత్యనారాయణ పురంలోని రైల్వే పార్కు వద్ద ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకుని చెట్ల పొదల్లో దాచిన 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ సస్పెక్ట్ షీట్ ఉందని, అతనిపై బైక్ చోరీలు, ఇళ్లలో దొంగతనాలు, గంజాయి, అత్యాచారం తదితర 15 కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భగవద్గీతపై ప్రచారం

నున్న(విజయవాడరూరల్): గురుపౌర్ణమిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంతి ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ సభ్యులు మంగళవారం నున్న గ్రామంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడిని మాత్రమే జగద్గురువుగా ఎందుకు పూజించాలో వివరించారు. ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా, పెద్దగా ఉండటంతో గురుపౌర్ణమిగా నిర్ణయించి, శ్రీకృష్ణుడుని మాత్రమే జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ అధ్యక్షుడు జగీరపు సురేష్ తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలతో టీబీ నియంత్రణ



టీబీ వ్యాక్సినేషన్ చేస్తున్న డాక్టర్ శివప్రసాద్

వించిపేట(విజయవాడపశ్చిమ): వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకుంటే టీబీని నియంత్రించవచ్చని షేక్ రాజాసాహేబ్ జనరల్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హాస్పటల్ ప్రాంగణంలోని టీబీ యూనిట్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నియంత్రణ చర్యల్లో భాగంగా తొలిసారిగా సైటీబీ ఇంజక్షన్‌లను చేయించామనానరు. టీబీ బాధిత కుటుంబ సభ్యులకు, మధుమేహ పీడితులకు ఈ ఇంజక్షన్ చేసి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు సూచించారు. అనంతరం టీబీ చికిత్స విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, కొత్తపేట టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్న విధానాలతో గాలి నాణ్యతను పెంచుదాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాలుష్య రహిత సమాజానికి మనం పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండటం కీలకమని.. వినూత్న విధానాలతో విజయవాడ నగరం వాయు కాలుష్యం బారిన పడకుండా చేసేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జాతీయ శుద్ధ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) అమలుపై సమీక్షించేందుకు విజయవాడ నగర ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. కాలుష్య నియంత్రణ, విజయవాడ నగరపాలక సంస్థ, రవాణా, పరిశ్రమలు తదితర శాఖలు వాయు నాణ్యతను పెంచేందుకు చేపట్టిన పనులు, వాటిలో పురోగతిపై సమీక్షించారు. భవిష్యత్ కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నగరం నలువైపులా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ల డేటాను ఎప్పటికప్పుడు విశ్లేషించాలన్నారు. దుమ్ముధూళి వ్యాప్తి చెందకుండా, గాలిలో పీఎం10 సూక్ష్మ ధూళికణాలను లక్ష్యాల మేరకు తగ్గించే కార్యక్రమాలు పటిష్టంగా అమలయ్యేలా చూడాలన్నారు. కాలుష్య రహిత ప్రయాణానికి వీలుకలిగించేలా రహదారుల నిర్మాణం, పేవ్‌మెంట్ రహదారుల ఏర్పాటు, హరిత విస్తీర్ణం పెంపు, మెకానికల్ స్వీపర్ల వినియోగం, ఘన వ్యర్థాల నిర్వహణ, కాలువ గట్ల హరిత సుందరీకరణ వంటి చర్యలను ముమ్మరం చేయాలన్నారు. రూ.5 కోట్లతో చేపట్టిన ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బ్యాటరీ వాహనాలతో పాటు పెద్దఎత్తున విద్యుత్, సోలార్ ఈ- రిక్షాలను ప్రోత్సహించాలన్నారు. నగరాన్ని ఆదర్శవంతంగా నిలిపేలా ఆక్సిజన్ పార్కు అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. కాలుష్య కారకాలను వెదజల్లే వాహనాలను గుర్తించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీటీపీఎస్ బూడిద, ఇతర కాలుష్య కారకాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులకు కలెక్టర్ సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి అడ్డుకట్టవేయాలన్నారు. జూలై 4న ఎయిర్ క్లీన్ ప్రోగ్రామ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.శ్రీనివాస్, డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు, వీఎంసీ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్టులు) పి.సత్యకుమారి, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జి, వీటీపీఎస్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఆర్‌టీవో ఆర్.ప్రవీణ్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎస్‌వో ఎ.పాపారావు, డీఏవో డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న బోండా ఉమామహేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 27వ డివిజన్ బావాజీపేట 5వ లైన్ కుందేటి వారి వీధిలో రూ.19 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని అన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. సాధ్యమైనంత త్వరలోనే రోడ్డుపనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని అన్నారు. కార్యక్రమంలో నవనీతం సాంబశివరావు, పైడిపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు అండగా ఉండాలి



అబ్దుల్ అలీభాయ్‌కి నియామక పత్రం అందజేస్తున్న నాగుల్ మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీలో సభ్యులుగా చేరే వారు పేద ముస్లిం కుటుంబాలకు సహాయం చేస్తూ అండగా ఉండాలని కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా సూచించారు. మంగళవారం 64వ డివిజన్ కండ్రిక కమిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద ముస్లింలను ఆదుకొనేందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలను నియమిస్తున్నామన్నారు. అందులో భాగంగా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కల గ్రామానికి చెందిన అబ్దుల్ అలీ భాయ్‌ని ఇన్‌చార్జిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కమిటీ నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, 64వ డివిజన్ ప్రధానకార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

'డ్రంక్ అండ్ డ్రైవ్' నిందితులకు జైలు, జరిమానా

సత్యనారాయణపురం(సత్యనారాయణపురం): ఇటీవల నగరంలోని మూడవ ట్రాఫిక్ పోలీసులు సత్యనారాయణపురం పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న యాభై మందిని అదుపులోకి తీసుకుని వారి వాహనాలను సీజ్ చేశారు. మంగళవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా అందులో 47 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.4.70 లక్షలు జరిమానా విధించారు. జరిమానా కట్టని ముగ్గురికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధిస్తు రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.శర్మ తీర్పు వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ వాహనదారులు ఈ తీర్పును ఒక హెచ్చరికలా తీసుకుని మద్యం సేవించి వాహనాలను నడపడం మానుకోవాలన్నారు.
ఇటువంటివి కేవలం ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడమే కాదని, అది ప్రాణాంతకమైన నేరంగా పరిగణిస్తారన్నారు. రోడ్లపై ప్రయాణించే అమాయకుల ప్రాణాలను కూడా ప్రమాదంలో నెట్టే తీవ్రమైన చర్య అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

ప్రాణాపాయం నుంచి కాపాడేది రక్తదానమే

రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ వెలగా జోషి



రక్తదాన శిబిరంలో జోషి, వాసు, ఎస్‌బీఐ సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనిషిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడేది రక్తదానమేనని రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏర్పడి 70 ఏళ్లు అయిన సందర్భంగా గొల్లపూడి బ్రాంచిలో మంగళవారం రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్‌బీఐ గొల్లపూడి బ్రాంచి రీజనల్ మేనేజర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వెలగా జోషి మాట్లాడుతూ రక్తదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, యువతను రక్తదానంపై చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గొల్లపూడి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వాసు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం మంచిదని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మదన్‌మోహన్, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ చిట్టిబాబు, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.